క్లుప్తంగా

భారతీయ బౌద్ధ మహాసభ సమావేశం



మాట్లాడుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో అంబేద్కర్ భవనంలో భారతీయ బౌద్ధ మహాసభ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముందుగా గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతీయ బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు దుండే సంతోశ్‌కుమార్ మాట్లాడుతూ.. గౌతమ బుద్ధుడు బోధించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కాంరాజ్, శివాజీ, సునీల్, మోరే దీలిప్, రాజువర్ధన్ పాల్గొన్నారు.

తెరుచుకుంటున్న దుకాణాలు

ఉట్నూర్‌రూరల్: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఉట్నూర్ మండల కేంద్రంలోని దుకాణ సముదాయాల్లో వరద నీరు చేరింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వ్యాపారులు దుకాణాలను తెరిచి సామగ్రిని శుభ్రం చేసుకుంటున్నారు. ఆదివారం ఉట్నూర్ వారసంత కావడంతో వ్యాపారాన్ని కొనసాగించారు.

నేడు గ్రామసభ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మెజార్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో సూర్య ప్రకాశ్ తెలిపారు. 2023 – 2025లో అబ్కారి శాఖ నిర్వహించే వైన్స్‌ల ఏజెన్సీలో నిబంధనల ప్రకారం.. గ్రామ పంచాయతీ తీర్మానం కోసం గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు.

విరాళం



విరాళం అందజేస్తున్న నాయకులు

బోథ్: మండలంలోని సోనాల గ్రామంలో పీరీల షెడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రూ.20 వేలు అందించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ మొత్తాన్ని పీరీల నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తుల సాగర్, వడ్ల లింగయ్య, చెట్లపల్లి రవికాంత్, వసంతరావు పటేల్, గట్కు నారాయణ, మునేశ్వర్ సోమన్న, అమత్‌రావు పాటిల్, కుమ్మరి సత్యనారాయణ, లోలపూ పోశెట్టి, సంతోశ్, బాల దేవన్న పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

నేరడిగొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఆదివారం జెడ్పీటీసీ అనిల్ జాదవ్ మండలంలోని బొందిడి, దర్బ, దర్బతండా గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతామన్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు ఆదివారం మండలంలోని జంబుల్‌ధరి గ్రామంలోని ప్రజలకు సాయిరాం భగవాన్ శ్రీసత్యసాయి బాబా భక్తులు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీవో

ఖానాపూర్: ఇటీవల నిర్మల్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రత్న కల్యాణి ఆదివారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. తహసీల్దార్ రాజమోహన్, కేహెచ్‌ఖాన్ ఉన్నారు.

వర్షం పడితే అంతే..

- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- విరిగిపోతున్న స్తంభాలు
- ముందుచూపులేని విద్యుత్‌శాఖ అధికారులు



మరమ్మతు చేస్తున్న సిబ్బంది



కొత్తపల్లిలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

బజార్‌హత్నూర్: వర్షాకాలం వచ్చిందంటే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందనే ఆందోళన ప్రజలను వెంటాడుతోంది. ఒక్కభారీ వర్షం కురిసిన ఏదో ఒక చోట విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం పరిపాటిగా మారింది. నాలుగు సంవత్సరాల క్రితం ఒక్క భారీ వర్షానికి మండలంలోని భూతాయి, చింతల సాంగ్వీ ప్రాంతంలో మిషన్ భగీరథ సంపుల వరకు ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌లో 36 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గతంలో బజార్‌హత్నూర్ సమీపంలోని కడెం వాగు వంతెన సమీపంలో వరద దాటికి ఇచ్చోడ నుంచి సరఫరా అయ్యే 33 కేవీ విద్యుత్ లైన్‌లో 8 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో రెండు రోజులు మండలానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదే ఏడాది సోనాల నుంచి వస్తున్న 33 కేవీ విద్యుత్ లైన్‌లో మూడు విద్యత్ స్తంభాలు విరగడంతో విద్యుత్ సమస్య తలెత్తింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇచ్చోడ నుంచి సరఫరా అయ్యే 33 కేవీ విద్యుత్ లైన్‌లో రెండు స్తంభాలు విరిగిపడ్డాయి. ప్రస్తుతం మరమ్మతుల పనులు జరుగుతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో సోనాల నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. గాలిదుమారం, వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.

విద్యుత్‌శాఖ సిబ్బంది వివరాలు..

సిబ్బంది	భర్తీ అయినవి	ఖాళీలు
ఏఈ	0	1
ఫోర్‌మెన్	0	1
సబ్‌ఇంజినీర్	1	0
లైన్‌ఇన్‌స్పెక్టర్	2	0
లైన్‌మెన్లు	1	2
అసిస్టెంట్ లైన్‌మెన్లు	0	2
జేఎల్‌ఎం	4	0

మండలంలో విద్యుత్ కనెక్షన్లు
విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు 368
ఇంటి విద్యుత్ కనెక్షన్లు 13160
వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 322

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు..

మండలంలో 368 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా.. వాటిలో సగానికి పైగా కంచెలు లేవు. దీంతో పశువులు పదుల సంఖ్యలో మృతి చెందుతున్నాయి. పశువులు మృతి చెందిన సమయంలో తాత్కాలిక ఏరాట్లు చేస్తున్నారు తప్పా.. పూర్తిస్థాయి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

మండలంలో 30 గ్రామపంచాయతీల పరిధిలో 64 గ్రామాలున్నాయి. ఇంత పెద్ద మండలంలో రెండు మాత్రమే విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. విద్యుత్ సరఫరాను పర్యవేక్షించే విద్యుత్ శాఖ ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. విద్యుత్‌శాఖ సబ్ ఇంజినీరే ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మండలంలో 13 వేల విద్యుత్ కనెక్షన్లు ఉంటే ఉన్న సిబ్బందితో 5 వేల కనెక్షన్లను పర్యవేక్షించే పరిస్థితి లేదు. సిబ్బంది కొరతతో మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో ఆలస్యమవుతుంది.

చిన్న గాలికే కరెంటు పోతది



మా గ్రామంలో చిన్న గాలికే కరెంట్ పోతది. గాలి దుమారం వచ్చిన, వర్షాలు పడిన ఆరోజు కరెంటు ఉండదు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగిలిన విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. మూడు దశాబ్దాల క్రితం వేసిన విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టినా.. కొత్త వాటిని ఏర్పాటు చేయడం లేదు.

రబ్దే రవికుమార్, చందునాయక్‌తండా

విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం

మండలంలో రెగ్యులర్ విద్యుత్ శాఖ ఏఈ ప్రవీణ్ జూన్ నెలలో ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లారు. మండలంలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. ఉన్న సిబ్బందితో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నాం. మండలంలో నల్లరేగడి నేల స్వాభావం ఉండడంతో స్తంభాలు ఒకవైపుకు ఒరుగుతున్నాయి.

– రవి కుమార్, ఇన్‌చార్జి ఏఈ విద్యుత్‌శాఖ, బజార్‌హత్నూర్

ఫొటో, వీడియోగ్రాఫర్ల కార్యవర్గం ఎన్నిక



బేల: ఎన్నికైన సభ్యులు

బేల: మండల కేంద్రంలోని గణేశ్ గార్డెన్‌లో ఆదివారం మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కాడే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బందు పెట్కర్, కోశాధికారిగా నైతం పురుషోత్తం, గౌరవ అధ్యక్షుడిగా వాంఖడే సందీప్, ఉపాధ్యక్షుడిగా కొడే విశాల్, సంయుక్త కార్యదర్శిగా బిడ్కర్ మనోజ్, కుటుంబ భరోసా ఇన్‌చార్జి చిలంచెట్టి శంకర్, తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ అశోక్, దత్తా నిక్కమ్, అడెల్లు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పొచ్చన్న

కైలాస్‌నగర్: మత్స్యకారుల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బొమ్మెన పొచ్చన్న నియమాకమయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు లోకన బోయిన రమణ ఉత్తర్వులను జారీ చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ.. మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. డివిజన్, మండల, పట్టణ కార్యవర్గాలను త్వరలోనే నియమించి సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని అశోక బుద్ధ వీహార్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భీంరావ్ వాఘ్మరే, ప్రధాన కార్యదర్శిగా దాదాసాహెబ్ జాబడే, ఉపాధ్యక్షుడిగా ఉద్ధవ్ సూర్యవంశీ, జాయింట్ సెక్రెటరీగా ఆకాష్ కాంబ్లే ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా.. కోశాధికారిగా అంబాజీ పవార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.

మాల సంఘం..

బోథ్: మండల మాల సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొరుగు రమేశ్, ఉపాధ్యక్షుడిగా బక్కువరి ఆశన్న, దాసరి నాగరాజు, జక్కుల లక్ష్మన్న, కోశాధికారిగా దేవుల చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో మాల కులసంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కైలాస్‌నగర్: బోథ్ నియోజకవర్గ పరిధిలోని ఇచ్చోడ మండల కేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు కావడంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును ఆదివారం ఆయన స్వగృహంలో కలిసి సన్మానించారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, అధ్యాపకులు సంతోశ్‌కుమార్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఎస్సైకి..

గుడిహత్నూర్: బదిలీపై వెళ్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్‌ను మండలవాసులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయన అందించిన ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవలు, శాంతి భద్రతల నిర్వహణతో పాటు ఎన్నో కీలక కేసులను ఛేదించారని కొనియాడారు. అలాగే ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఇమ్రాన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్సై రహమాన్, లింగాపూర్ సర్పంచ్ జాడి సుభాష్, సంజీవ్ ముండే, గన్నోజి శ్రీనివాస్, జాదవ్ రమేశ్ పాల్గొన్నారు.

100కు డయల్ చేయాలి



మాట్లాడుతున్న బోథ్ సీఐ భీమేష్

బోథ్: ఆపద వస్తే 100డయల్ చేయాలని బోథ్ సీఐ భీమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కొట గ్రామానికి సందర్శించి, గ్రామస్తులతో ముచ్చటించారు. వరదలు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



బాధితురాలికి ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

బేల: నష్టాన్ని అంచనా వేసి, రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం మండలంలోని సైద్‌పూర్, రేణిగూడ, డౌన, సాంగ్వి(జి) గ్రామాల్లో పర్యటించారు. వరద బాధితులకు ఒక్కక్కరికి రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు అధైర్యపడొద్దన్నారు. ఇల్లు దెబ్బతిన్న వారికి గృహలక్ష్మీ పథకం కింద ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. సాత్నాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎక్కువ పెరగడంతో పంట నష్టం వాటిల్లిందన్నారు. రేణిగూడకు వెళ్లే మార్గంలోని వంతెన నిర్మాణానికి రూ.3 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. యుద్ధ ప్రతిపాదికన రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, తాక్రే గంభీర్, సతీశ్‌పవార్, ప్రమోద్ రెడ్డి, రాథోడ్ రోహిదాస్, కిష్టు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్



కార్మికులకు మద్దతు తెలుపుతున్న రాములునాయక్

ఇచ్చోడ: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకులు రాములునాయక్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మెలో పాల్గొని మాట్లాడారు. గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కార్మికులు సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు.

బీఎస్పీ నాయకుల మద్దతు

బజార్‌హత్నూర్: వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదివారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్, బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి మెస్రం జంగుబాబు అన్నారు. కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. అట్టడుగు వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో దేవేందర్‌గౌడ్, కిష్టయ్య, ప్రభాకర్, లక్ష్మీ, నరేశ్, లలిత, నర్సుబాయి, రవి, మధుకర్, గంగామణి, అడెల్లు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



జెండా ఊపి బస్‌ను ప్రారంభిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా వాటీగావ్‌లో మంగళవారం నిర్వహించే సాహిత్య సామ్రాట్ అన్నభావుసాతే జయంతికి మాంగ్ కులస్తులు ఆదివారం ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ బస్సును మున్సిపల్ చైర్మన్ జెండా ఊపి ప్రారంభించారు. సాహిత్య పితామహుడిగా కీర్తి సంపాదించిన సంఘ సంస్కర్త అన్నాభావు సాతే స్వగ్రామంలో జరగనున్న జయంతి ఉత్సవాల్లో సీఎం కేసీఆర్ పాల్గొంటున్నారన్నారు. పట్టణంలో అన్నభావుసాతే విగ్రహం వద్ద సుందరీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో అన్నాభావు సాతే అసోసియేషన్ అధ్యక్షుడు కాంబ్లే ఉద్ధవ్, ఉపాధ్యక్షుడు నర్సింగ్ మోరే, వాసుదేవ్, అర్జున్, అనిల్, డికే జ్ఞానోబా, దయానంద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ పరామర్శ



పరామర్శిస్తున్న జెడ్పీటీసీ అనిల్‌జాదవ్

నేరడిగొండ: మండలంలో ఆదివారం జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ పర్యటించారు. భవానితండాలో రబ్దే అమర్‌సింగ్ ఇటీవల మృతిచెందాడు. అలాగే బొందిడి గ్రామానికి చెందిన రాథోడ్ జైవంతబాయి తేరివి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ మాజీ డైరెక్టర్ జాదవ్ గణేశ్, జహీర్, దేవేందర్ రెడ్డి, సాబ్లే నానక్ సింగ్, ప్రతాప్ సింగ్, శేఖర్, అల్లూరి నవీన్ ఉన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన బత్తుల వినోద్ తల్లి బత్తుల సావిత్రిబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ గొడం నగేశ్ ఆదివా రం గ్రామానికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్యాక్స్ చైర్మన్ మేకల వెంక న్న యాదవ్, అల్కే గణేష్, చిల్కూరి భూమన్న, నానం రమణ, పరచ సాయన్న, చట్ల విలాస్, చట్ల ఉత్తం, నంది నర్సయ్య ఉన్నారు.

రోడ్డు లేక రైతుల ఇబ్బందులు



శ్రమదానం ద్వారా రోడ్డును బాగు చేసుకుంటున్న రైతులు

- ఎడ్లబండి కూడా వెళ్లలేని స్థితిలో రోడ్డు
- శ్రమదానంతో బాగు చేసుకున్న రైతులు

తలమడుగు: మండల కేంద్రానికి ఆనుకోని ఉన్న గుట్టకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆదివారం రైతులు శ్రమదానం చేసి రోడ్డును బాగు చేసుకున్నారు. తలమడుగు గుట్టపై దాదాపు 2 వేల ఎకరాల సాగు భూమి ఉందని, దశబ్దాల నుంచి భూములను సాగు చేసుకుంటూ.. కుటుంబాలను పోషించుకున్నామన్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు హామీలు ఇస్తున్నారు తప్పా.. రోడ్డు నిర్మించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పండించిన పంటను ఇంటికి తీసుకువచ్చేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. మండల కేంద్రం నుండి గుట్టపైకి రోడ్డు నిర్మాణం చేపడితే చర్లపల్లి, ఝరి, సకినాపూర్, బరంపూర్, పెద్దపల్లి గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. రోడ్డు సక్రమంగా లేక పోవడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కనీసం ఎడ్లబండి కుడా వెళ్లలేని స్థితిలో రోడ్డు ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఏటా వరద ముప్పు

ఖానాపూర్: పాలకులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతోనే ఏటా వర్షాకాలంలో నియోజకవర్గ ప్రాంత ప్రజలకు ముప్పు వాటిల్లుతుందని బీజేపీ నాయకులు, ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జేకేనగర్, రాజీవ్ నగర్ తదితర ప్రాంతాలోవరదలతో నష్టపోయిన బాధితులను పరామర్శించారు. ఖానాపూర్, కడెం మండలాల ఆయకట్టు రైతులకు సదర్మాట్ ద్వారా నీటిని అందించడంలో పాలకులు విఫలం అవుతున్నారని పేర్కొన్నారు. ఇటీవలే కురిసిన వర్షాలకు గండిపడిన ప్రాంతాలను సందర్శించారు. ఎకరాకు రూ.50వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. టేకు ప్రకాష్, నాయిని సంతోష్, అనిల్‌రావు, ఆకుల శ్రీనివాస్, బుచ్చన్న, డి.మల్లయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్..



భోరజ్ వైన్స్‌లో చోరీ

జైనథ్: మండలంలోని భోరజ్ సమీపం వైన్స్‌లో చోరీరీ జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి మాస్క్ ధరించిన ముగ్గురు వ్యక్తులు చోరీ పాల్పడినట్లు సీసీటీవీలో రికార్డ్ అయ్యింది. 26 పెట్టెల మద్యంతో పాటు రూ. 30 వేల నగదు చోరీకి గురైనట్లు వైన్స్ నిర్వాహకుడు ఆశీష్ తెలిపారు. సీసీ కెమెరా, షెడ్డును ధ్వంసం చేశారు. మద్యం సీసాలతో ఆటోలో పరారైనట్లు సీసీటీవీలో రికార్డ్ కావడంతో ఆదివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు.

రెండు ఆటోలు ఢీ..

బోథ్: మండలంలోని కుచలాపూర్ ధనుర్ రోడ్డుపై ఎదురెదురుగా ఆటోలు ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వివాహిత ఆచూకీ లభ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల అదృశ్యమైన హర్యానకు చెందిన వివాహిత ఆచూకీ లభ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మూడు రోజుల క్రితం హర్యాన పోలీసులు ఆదిలాబాద్‌లో గాలింపు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. వివాహితతో పాటు జిమ్ యజమాని హైదరాబాద్‌లో ఉండడంతో వారిద్దరిని వన్‌టౌన్ పోలీసులు శనివారం రాత్రి తీసుకువచ్చి హర్యాన పోలీసులకు అప్పగించారు.

కారుడ్రైవర్‌పై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీస్ కాలనీ సమీపంలో బైక్‌కు కారు తగిలించిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌లోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన రాథోడ్ వంశీక్రిష్ణ ఈనెల 26న బట్టిసావర్‌గాం నుంచి బైక్‌పై వస్తున్నాడు. పోలీస్ కాలనీ సమీపంలో ఇండికేషన్ వేయకుండా డ్రైవర్ శివకుమార్ కారును కుడి వైపు టర్న్ చేయగా బైక్‌కు తగిలింది. వంశీక్రిష్ణకు గాయమైంది. చికిత్స అనంతరం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వంతెనలకు మరమ్మతులు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామ సమీపంలోని కొట్టుకుపోయిన వంతెనకు మరమ్మతులు చేయాలని ఆదివారం తలమడుగు మండల సాధన సమితి నాయకులు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు వినతిపత్రం అందజేశారు. బరంపూర్ చుట్టూ పక్కల 24 గ్రామాలకు వంతెన లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే ఆర్అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. బొల్లారం బాబన్న, రమేశ్‌రెడ్డి, మొట్ట కిరణ్‌కుమార్, సాగర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899